# తండ్రి గారి సందేశం....



## సిలువ - ప్రేమకు గుర్తు

**క్రీస్తు నాథుని యందు ప్రియ సహోదరీ సహోదరులారా!**

యేసు ప్రభువు పాపులమైన మన కొరకు అనుభవించినటువంటి బాధలు, శ్రమలు మరియు ఆయన జీవత్యాగమును తపస్సు కాలములో మనము స్మరించుకుంటున్నాము. తపస్సు కాలపు 50 రోజులు క్రైస్తవ బిడ్డలమైన మన జీవితంలో ఆధ్యాత్మిక ఫలాలు ధారాళముగా పొందే పుణ్యదినాలు. మన రక్షణ కొరకు ఆయన తనను తాను అర్పించిన సిలువ బలి విలువ ఎంత గొప్పదో అని మనకు తెలుసు. అందుకే కదా తపస్సు కాలమును ప్రార్థన, పశ్చాత్తాపము మరియు దానధర్మాలతో నిండిన రోజులుగా మనము ఆచరిస్తున్నాము. ఈ తపస్సు కాలములో మనము అర్థము చేసుకోవలసిన రెండు ముఖ్యమైన అంశాలు మీకు తెలియజేయాలని నేను ఆశిస్తున్నాను.

**1. సిలువ – ప్రేమకు గుర్తు**

తపస్సు కాలము దేవుని సిలువ మరణమును ధ్యానిస్తూ ప్రార్థిస్తున్నటువంటి రోజులు. ఆయన చేసినటువంటి సిలువ బలి ద్వారా, సిలువ ప్రేమకు గుర్తుగా ఎల్లప్పుడు నిలిపోయింది. అందుకే పౌలుగారు కొరింతీయులకు వ్రాసిన మొదటి లేఖలో ప్రేమ సహనము కలది (1 కొరింతీ 13,4) అని వ్రాసాడు. యేసు ప్రభువు తన సిలువ బలి ద్వారా నిజమైన ప్రేమ ఏమిటో లోకానికి చూపించారు. ఎందుకంటే, “తన స్నేహితుల కొరకు తన ప్రాణమును ధారపోయు వాని కంటే ఎక్కువ ప్రేమ కలవాడు ఎవడును లేడు” (యోహాను 15,13). త్యాగం లేకుండా ప్రేమ ఉండదు అని సిలువ మనకు గుర్తు చేస్తుంది. దేవుని అపరిమత ప్రేమ గురించి మనము సువార్తలో చదువుతున్నాము. “దేవుడు ఈ లోకమును ఎంతో ప్రేమించి, తన ఏకైక కుమారుని ప్రసాదించెను” (యోహాను 3,16). తన పోలికలో సృజించినటువంటి మానవున్ని (ఆది 1,27) పాపపు బానిసత్వము నుండి రక్షించి నిత్యజీవమును ప్రసాదించడానికి యావే ఇట్లు చేసెను. తన ఏకైక కుమారుని రక్తముచే కడుగబడిననే తప్ప, పాపములో మునిగియున్న మనుష్యులను రక్షించడం సాధ్యం కాదు అని యావే దేవుడు ఎరిగియున్నారు. అందుకే తన ఏకైక కుమారుని ఈ లోకమునకు పంపారు.

యేసు ప్రభువు సిలువలో మరణించాలన్నదియే దేవుని ప్రణాళిక. ఎందుకంటే రక్తము దారపోయక పాపక్షమాపణ అనేది ఉండదు (హెబ్రీ 9,22). “మనము పాపాత్ములమై ఉన్నప్పుడే క్రీస్తు మన కొరకై మరణించి, దేవుడు మనపై తనకు ఉన్న ప్రేమను చూపించినాడు” (రోమీ 5,8) అని మనము పవిత్ర గ్రంథములో చదువుతున్నాము. మన కొరకు దేవుడు తన ఏకైక కుమారుని ఈ లోకానికి పంపడం, ఆ కుమారుని జీవత్యాగము ద్వారా మనము శుద్ధిచేయబడుట, మన యోగ్యతవలనో, గొప్పతనమువలనో కాదు. మనము పాపముచే దూరమైనను దేవునికి మనపైగల అవదుల్లేని ప్రేమ వలన మాత్రమే. అందుకే సిలువ ప్రేమకు

గుర్తుగా మారిపోయింది. ఇంతకంటే ఎక్కువగా దేవుడు మనలను ప్రేమించలేదు. ఆయన తనకున్నదంతయు ఒసగి ఈ లోకాన్ని ప్రేమించారు. ఈ తపస్సు కాలములో ప్రేమకు గుర్తుగానున్న సిలువను పట్టుకొని సిలువ జీవితము జీవింపగలగాలి. సిలువ జీవితము అంటే ప్రేమతో నిండియున్న జీవితము. ఈ ప్రేమయే మనలను ముందుకు నడిపిస్తుంది. ప్రేమకు గుర్తుగానున్న సిలువ మనకు ఇలా బోధిస్తున్నది. ఈ తపస్సు కాలములో ప్రత్యేకముగా "నేను మిమ్ము ప్రేమించినట్లే, మీరును ఒకరిని ఒకరు ప్రేమింపుడు" (యోహాను 13,34). అనే ప్రభు వాక్కులను స్మరించుకుందాం. ఈ నిస్వార్థమైనటువంటి ప్రేమయే మనలను ఉపవాసములో, ప్రార్థనలో మరియు ధానదర్మాలలో జీవించడానికి ప్రేరేపిస్తుంది.

**2. తపస్సు కాలములో సరియైన ఉపవాసం**

తపస్సు కాలము ఉపవాసముతో జీవించే రోజులు అని మనకందరికి తెలుసు కాని సరియైన ఉపవాసం ఏ విధముగా ఆచరించాలి అని యోషయా గ్రంథం 58,1-10లో మనము చదువుతున్నాము. యెషయా ప్రవక్త ద్వారా మనము ఎలా ఉపవాసం ఆచరిస్తున్నామనియు (యెషయా 58,1-5) మరియు దేవుడు ఇష్టపడు ఉపవాసం ఏమిటనియు (యెషయా 58,6-10) ఈ వాక్యాలలో చాలా స్పష్టంగా దేవుడు మనతో మాట్లాడుతున్నాడు.

ఆకలిగొనిన వారికి భోజనము పెట్టాలి (58,10) బాధితులను ఆదుకోవాలి, అన్యాయపు బంధములను విప్పి, పీడితులను ఎట్టి బాధలకు గురికాకుండా విడిపించాలి (58,6) అని దేవుడు గుర్తు చేస్తున్నాడు. భోజనము లేని వారికి ఆహారము, ఇల్లు లేని వారికి ఆశ్రయము, బట్టలు లేని వారికి దుస్తులను ఇవ్వడము మరియు మన బంధువులకు సహాయం నిరాకరింపకుండా ఉండుటయే (58,7) సరియైన ఉపవాసం. అప్పుడు మనము చేసే ఉపవాసానికి తీసుకునే దీక్షలకు ఒక సరియైన అర్థం ఉంటుంది.

కాబట్టి ప్రియులారా ఈ తపస్సుకాలములో మనం మన పొరుగువారికి, బంధుమిత్రులకు నిస్వార్థమైన సేవాభావముతో సహాయము చేయాలి. ఒకవేళ మనము పేదవాళ్ళమని అనుకొని ఎట్లా ఇతరులకు సహాయము చేయగలమని అనుకోవచ్చు. కాని, అన్యారోగ్యంతో బాధపడుతున్న వారిని సంధర్శించడము, ఇతరులను చిరునవ్వుతో పలకరించడము మరియు ఇతరుల కోసం ప్రార్థన చేయడం కూడా పుణ్య కార్యమే అని మనము తెలుసుకోవాలి. కావున ఈ తపస్సుకాలములో దేవుని వచనం మీద ఆధారపడి, దేవుని వాక్యాన్ని చదువుతూ, ధ్యానిస్తూ మరియు పాటించి, జీవించడానికి ప్రయత్నము చేద్దాం. ఎందుకంటే "దేవుని వాక్కు నిష్ఫలముగా ఉండదు" (యెషయా 55,11). భూమ్యాకాశములు గతించిపోయినా ఎన్నటికిని గతించిపోని (లూకా 21,33) దేవుని వచనంలో విశ్వసించి, దేవుడు ఇష్టపడుతున్న ఉపవాసములతో ఈ తపస్సు కాలము గడపడానికి ప్రయత్నము చేద్దాం.

దేవుడు మనలందరిని దీవించును గాక!

**జీవము గలిగిన సజీవ దేవుని జీవస్వరం**
**మనలనందరిని జీవింపజేయును గాక. ఆమెన్.**

క్రీస్తు నందు మీ తండ్రి
**బిషప్ ప్రిన్స్ అంతోని**
ఆదిలాబాద్ గురుపీఠ మేత్రాణులు